క్లుప్తంగా

బీజేపీ మరో కుట్ర

ధర్మసాగర్: మాదిగలను మోసం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం మరో కుట్ర పన్నుతుందని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్‌మాదిగ మంగళవారం ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కమిటీల పేరుతో మాదిగలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. 30 ఏళ్ల కల, చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ బిల్లును దేశ ప్రధాని నరేంద్రమోదీ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి అమలు చేస్తారని ఆశతో మాదిగ సమాజం ఎదురు చూసిందన్నారు. కానీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేసేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. గతంలో ఎన్నో కమిటీలు ఆధారాలతో ఉన్నాయని, వాటిని ఆధారంగా చేసుకొని వర్గీకరణ చేయవచ్చన్నారు. కానీ బీజేపీని తెలంగాణలో రాజకీయంగా బలోపేతం చేసేందుకే మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించినట్లు ఉందని విమర్శించారు. రాజకీయ డ్రామా తప్ప ఎస్సీ వర్గీకరణపైన బీజేపీకి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. విశ్వరూప మహాసభ ద్వారా బీజేపీ వైఖరి ఎంటో మరోసారి నిరూపణ అయ్యిందన్నారు. కేవలం ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే రాజకీయ నాయకులకు మాదిగలు గుర్తుకొస్తారని, ఓట్లను దండుకునేందుకు కపటప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. మాదిగ సమాజం బీజేపీకి గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

19న క్రికెట్ మ్యాచ్‌లు

వరంగల్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువ ఓటర్లకు ఈనెల 19న క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువకులు జిల్లా యువజన సంక్షేమ అధికారిని సంప్రదించాలని కోరారు. స్థానిక ప్రజలను భాగస్వాముల్ని చేస్తూ, ఓటు ప్రాధాన్యాన్ని వివరించేందుకు ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 93470 51066 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గొర్రెకుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సబ్ డివిజన్ పరిధి గొర్రెకుంట, ఏజే మిల్స్, స్టేషన్ రోడ్డు, ఫోర్ట్ వరంగల్‌కు చెందిన వినియోగదారులు సదస్సులో పాల్గొని తమ సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకురావాలని ఏడీఈ జి.గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.


ఇద్దరికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మడికొండ–ధర్మసాగర్ రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన యువకుడు ధర్మసాగర్ నుంచి వస్తుండగా మరోయువకుడు మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనానికి సమాచారం అందించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను వివరాలు కోరగా.. ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

క్యూఆర్ కోడ్ పై అవగాహన సదస్సు

హన్మకొండ అర్బన్ : క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఏ విధంగా ఈ– రిసోర్స్, వెబ్ సైట్స్, ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్ ఓపెన్ చేసుకోవాలనే అంశంపై పింగిళి కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి జగదీష్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో జగదీష్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని విభాగాల్లో ఈ క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్నారని, దీనికి కళాశాల, ఆర్గనైజేషన్‌కి సంబంధించిన లోగోస్‌ని యాడ్ చేస్తే మనకి అవసరమైన క్యూఆర్ కోడ్‌ను సులభంగా జనరేట్ చేసుకోవచ్చని సూచించారు. జాతీయ గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పేర్కొన్నారు. కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ సుహాసిని, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



ఆత్మకూరు: ఎన్నికల నేపథ్యంలో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ ఇన్‌చార్జ్ అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయిలో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గురుప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాజయ్యయాదవ్, సమ్మిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు



భూపాలపల్లి అర్బన్: వెంకటరమణారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు



మొగుళ్లపల్లి: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న గండ్ర వైశాలిరెడ్డి

- భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలోని పల్లెలన్నీ అభివృద్ధి చెందుతున్నాయని.. గ్రామాల అభివృద్ధికి ప్రధాన కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని రాంపూర్, గొల్లబుద్ధారం, చికెన్‌పల్లి, దూదేకులపల్లి, దీక్షకుంట గ్రామాలలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ప్రజా ఆశీర్వదయాత్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని వద్దని.. కేవలం మూడు నాలుగు గంటలు చాలు అంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలా ఆలోచించాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షలో పోడుహక్కు పత్రాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రం ఎవరి చేతిలో ఉంటే సుభిక్షంగా సుపరిపాలన సాగుతుందో ప్రజలు ఆలోచన చేసి ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లు 12 శాతానికి పెంచాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడిగినప్పటికీ సహకరించడం లేదన్నారు. సీఎం ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చి ప్రత్యేక తీర్మానం చేసి విద్య, ఉద్యోగ రంగాల్లో 12శాతం రిజర్వేషన్ కల్పించినట్లు వివరించారు. రూరల్ గ్రామాల్లో ప్రధాన పోడుపట్టాల సమస్యను ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో నిలిచి హక్కు పత్రాలు కల్పించినట్లు తెలిపారు. అటవీ అధికారులతో



భూపాలపల్లి అర్బన్: దివ్యాంగుడిని ఓటు అడుగుతున్న వెంకటరమణారెడ్డి

ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న రైతుల బాధను తన బాధగా భావించి శాశ్వత విముక్తి రైతులకు కల్పించినట్లు వివరించారు. ఎన్నికల సందర్భంలో కొంతమంది వచ్చి రెండుసార్లు ఓడిపోయాను అవకాశం కల్పించాలని మాట్లాడుతుంటారని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

గండ్ర వైశాలిరెడ్డి ఇంటింటా ప్రచారం..

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామంలో గండ్ర వెంకటరమణారెడ్డి కోడలు గండ్ర వైశాలిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మళ్లీ ఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన గండ్ర వెంకటరమణారెడ్డిని మళ్లీ ఓటేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి పాల్గొన్నారు.



శాయంపేట: ప్రచారం నిర్వహిస్తున్న గండ్రజ్యోతి

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

శాయంపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. మండలంలోని నర్సింహులపల్లి, గట్లకానిపర్తి, సూరంపేట, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చిట్యాల: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మడికొండ రవీందర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు గుర్రపు తిరుపతి గౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని అందుకుతండా, ఏలేటి రామయ్యపల్లి గ్రామాలలో వేర్వేరుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు గండ్ర వెంకట రమణారెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేపట్టారు. అనంతరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అన్వర్‌పాషా, అజ్మీ గోపాల్, హట్కారి వెంకట్ బీఆర్ఎస్‌లో చేరారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కూర మహిపాల్, సర్పంచ్ సిద్దంకి భాస్కర్, నాయకులు నోముల నాగరాజు, రాజేనాయక్, దాసరి తిరుపతి, జన్నె యుగేందర్ ఉన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



ఐనవోలు : నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



శాయంపేట : మహనీయుల వేషధారణలో పాఠశాల విద్యార్థులు

ఐనవోలు: నేటి బాలలే రేపటి పౌరులని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, పెన్సిళ్లు విద్యార్థులకు అందించారు. ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చుంచుకాల లింగారావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులు మధుకర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్, భవన్, ఉమాదేవి, ప్రణీత, రాధిక పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పదోతరగతి విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పుస్తకాల ప్రదర్శన చేశారు. అలాగే మండలంలోని ప్రగతిసింగారం సన్‌రైస్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు మహనీయుల వేషధారణతో అలరించారు.

దామెరలో..

దామెర: మండల కేంద్రం సమీపంలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ నవీన్ పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అంబర్ కిశోర్ ఝా

ధర్మసాగర్ / వేలేరు : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను, వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంతో పాటు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలోని పరిసరాలతో పాటు పలు రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల స్థితిగతులు, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మసాగర్ : వివరాలు తెలుసుకుంటున్న సీపీ

ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

- శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

పరకాల: పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాసోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కోమాళ్లపల్లి సంపత్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. 12వ వార్డు కౌన్సిలర్ బండి రాణి, సదానందం దంపతులు ఆలయానికి వంటసామగ్రి బహూకరించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం చేశారు. కార్తీక మాసం నెల రోజులపాటు భక్తుల సహకారంతో ఉదయం అన్నదానం, సాయంత్రం అల్పాహారం ఇవ్వనున్నట్లు గందె వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ఈఓ వెంకటయ్య, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వంటసామగ్రి అందజేస్తున్న దంపతులు

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

శాయంపేట : పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కు వజ్రాయుధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఈ నెల 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు ఓటుహక్కు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోత్స్న, శ్వేత, రత్నామాల, కవిత, అరుణ, రమ, పుష్పతోపాటు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీతారెడ్డి

గెలిపిస్తే రైల్వే లైన్ తీసుకొస్తా..



చిట్యాల: సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి



టేకుమట్ల: మహిళలతో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

- బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

చిట్యాల: నియోజకవర్గంలో బీజేపీని గెలిపిస్తే ఈ ప్రాంతానికి రైల్వేలైన్ తీసుకొస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భూపాలపల్లిలో బీజేపీ గెలిసిన తరువాత వెంటనే రైల్వే లైన్ ప్రతిపాదనలు పంపి ఈ ప్రాంతా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో తెలువని దుస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అభివృద్ధి పేరు చెప్పుకుని సొంత అభివృద్ధి కోసం పార్టీ మారిన విషయం అందరికి తెలుసన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ఇంట్లో రెండు పార్టీలు ఉన్నాయని అన్నారు. సామాజిక న్యాయం వైపు బీజేపీ పయనిస్తుందన్నారు. భూపాలపల్లికి రైల్వే మార్గంతో పాటు మైనింగ్, టెక్నిక్ ఇన్‌స్టిట్యూట్, కేంద్రీయా విద్యాలయం తీసుకోచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, నాయకులు ఇందిర, నర్సయ్య, రాజు, శేషి, మాచర్ల రఘు, పెరుమాండ్ల రాజు, అనిల్, రాయిని శ్రీనివాస్, మైదం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆశీర్వదించి గెలిపించాలి

మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆశీర్వదించి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం మండలంలోని నవాబుపేట, ఏలేటిరామయ్యపల్లి, చింతకుంట రామయ్యపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

టేకుమట్ల: నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. మీ ఆడబిడ్డను తనకు ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరారు. మహిళలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరెపల్లి మాజీ సర్పంచ్ కుర్రె పద్మ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు

- హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

వీణవంక/కమలాపూర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని, మాట ఇస్తే తప్పదని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, ఘన్ముక్కుల, కిష్టంపేట, దేశాయిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. ఘన్ముక్కుల, మల్లన్నపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో చింతల శ్యాంసుందర్ రెడ్డి, కర్ర భగవాన్‌రెడ్డి, సాహెబ్‌హుస్సేన్, మండల గణేశ్, మండల రాజు, గాజుల శ్రీనివాస్, నసీరొద్దీన్ హకీమ్, ఉపేందర్‌రెడ్డి, తాళ్లపల్లి సమ్మయ్య, చింతిరెడ్డి కోమల్‌రెడ్డి, మండల మహేందర్ ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని వొడితెల ప్రణవ్ అన్నారు. కమలాపూర్ మండలం శంభునిపల్లి, కానిపర్తి, దేశరాజుపల్లి, ఉప్పల్, ఉప్పులపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఆ పార్టీలకు ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. పేపర్ల లీకేజీతో పరీక్షలు రద్దు చేస్తూ నిరుద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తోందని, అవినీతిని ప్రశ్నించకుండా ఉండేందుకు యువతను తప్పుదారి పట్టిస్తోందన్నారు. మహిళలు, యువత కాంగ్రెస్ వైపు చూస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ పథకాలు రావని భయపెడుతున్నారని, ఎవరికీ భయపడొద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, నాయకులు తవుటం రవీందర్, దేశిని ఐలయ్యగౌడ్, బాలసాని రమేశ్‌గౌడ్, పాడేటి భిక్షపతి, ప్రసాద్, కొండ రమేశ్, హనుమాన్ ప్రసాద్, వంశీధర్‌రావు, మనీశ్, కృష్ణ, శివకృష్ణ, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లన్నపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రణవ్



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

క్రీడాకారుడికి సన్మానం

నడికూడ: మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయి టీమ్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దెయ్యాల రమేష్, భాస్కర్, అఖిల్ పాషా, నాగరాజు, అన్వర్, సాదిక్, ఉస్మాన్, ప్రణయ్, బషీద్, రాజు, అఖిర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ఇర్ఫాన్‌ను సన్మానిస్తున్న వేణుగోపాల్

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పరకాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

ఇంటింటా ప్రచారం

శాయంపేట : ప్రగతిసింగారంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణరావు గెలుపు కోరుతూ ఆయన కూతురు అశ్విని ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని పెద్దాపూర్‌లో వివిధ పార్టీల నుంచి మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

పరకాల: పట్టణానికి చెందిన పలువురు ఏబీవీపీ, బీజేపీ కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ధర్మసాగర్: మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి కండువా కప్పి ఆహ్వానించారు.

కమలాపూర్: మండలంలోని శంభునిపల్లి, కానిపర్తి, దేశరాజుపల్లి, పంగిడిపల్లి గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కండువా వేసి ఆహ్వానించారు.